


# మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

## అదనపు కలెక్టర్ విద్యాచందన

**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 28: ప్రజాజ్యోతి:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా శాంతి యుతంగా నిర్వహించడంలో జోనల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ విద్యా చందన అన్నారు. జిల్లా కలెక్టరేట్ లోని ఐడిఓసి మీటింగ్ హాల్ లో బుధవారం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ లు , జోనల్ అధికారులు , అకౌంటింగ్ టీమ్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి జోన్ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లపై జోనల్ అధికారులు నేరుగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, ఎన్నికల సిబ్బంది నియామకం, ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేయాలని, ఎలాంటి ఉల్లంఘనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టి శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత జోనల్ అధికారులదేనని అన్నారు, పోలింగ్ రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, ఫిర్యాదులు అందిన వెంటనే తక్షణమే స్పందించాలన్నారు. స్పష్టమైన ఆధారాలు సేకరించిన అనంతరమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ఏఐ ఆధారిత నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారంలో ఉన్నందున అధికారులు అత్యంత అప్రమత్తతతో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఉల్లంఘనలకు సంబంధించి ఏ అంశానికి ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేయాలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం ఎన్నికల శిక్షణ

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 29 | జనవరి | 2026 | పేజీలు : 3



# మున్సిపల్ ఎన్నికలు నామినేషన్ల దాఖలు వివరాలు

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 28: ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు ప్రక్రియ కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అశ్వరావుపేట మున్సిపాలిటీ, ఇల్లందు మున్సిపాలిటీ, కొత్తగూడెం కార్పొరేషన్ ఉండగా, వాటిలో 106 వార్డులు ఉన్నాయన్నారు, అశ్వారావుపేట మున్సిపాలిటీలోని 22 వార్డులకు గాను ఇప్పటివరకు 3 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. వీటిలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) – 2, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) – 1 నామినేషన్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇల్లందు మున్సిపాలిటీలోని

మిగతా 2 లో...



# ఓవర్ లోడ్.. ఓకేనా..?

- మైనర్ల చేతికి స్టీరింగ్..! మితిమీరిన వేగం..!
- ఇష్టానుసారంగా వాహనాల తయారీ..!
- ఎంవిఐ (మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్) డ్యూటీ ఉపన్యాసాలకే పరిమితమవుతుందా..?

**బూర్గంపహాడ్ జనవరి 28 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల పరిధిలోని సారపాక ఐటిసి పేపర్ మిల్లు ఫ్యాక్టరీకి కర్ర రవాణా చేస్తున్న ట్రాక్టర్లు ఓవర్ లోడింగ్ తో రోడ్ల పైకి వస్తున్నాయి. ఓవర్ లోడింగ్ ట్రాక్టర్లు బూర్గంపహాడ్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఇష్టాను రీతిగా రోడ్లపైన ఉరకలు వేస్తుంటే ప్రజలు తీవ్ర భయ భ్రాంతులకు గురవుతున్నారు. రోడ్లపై తిరుగుతున్న ఓవర్ లోడ్ ట్రాక్టర్లు మృత్యు పాశాల నిత్యం వెంటాడుతున్నప్పటికీ అధికారుల కళ్ళకు మాత్రం ఈ ఓవర్ లోడ్

మిగతా 2 లో...

# భద్రాచలంలో అక్రమ గంజాయి పట్టివేత

- ఒరిస్సా నుంచి కేరళకు కారు లో గంజాయి తరలింపు
- నిందితుల నుంచి రూ. 17 వేలు స్వాధీనం




**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 28: ప్రజాజ్యోత:** ఒరిస్సా మల్కాన్గిరి జిల్లా నుంచి కేరళకు కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. 50.4 కేజీల గంజాయి తో పాటు 17,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.తిరుపతి ఆధ్వర్యంలో ఎస్సై సిహెచ్ హరి రావు, సిబ్బంది కలిసి భద్రాచలం నుంచి నెల్లిపాక రోడ్డు లో వాహనాలు తనిఖీలు చేపట్టగా భద్రాచలం ఇసుక రీచ్ సమీపం లో అనుమానాస్పదంగా కనిపించిన ఒక కారు ను ఆపి తనిఖీ చేశారు, పట్టుబడిన కారు లో 50.4 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు, కారును స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టగా ఈ గంజాయి ని తిరువనంతపురం (కేరళ)కి చెందిన

మిగతా 2 లో...

## మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి



(మొదటి పేజీ తరువాయి...)

నోడల్ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ, మద్యం స్వాధీనం (లిక్కర్ సీజ్ యూర్) జరిగిన సందర్భాల్లో తప్పనిసరిగా వాటిని ఎక్సైజ్ శాఖకు అప్పగించాల్సి ఉంటుందని. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ప్రదేశానికి చేరుకుని స్పాట్ వెరిఫికేషన్ నిర్వహించి, మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో ఎఫ్ ఎస్ టి బృందాలు ఎస్ ఎస్ టి బృందాలకు సమాచారం ఇవ్వాలన్నారు, ఫిర్యాదు లేదా ఎఫ్ ఐఆర్ ను 24 గంటల్లోపు సంబంధిత న్యాయస్థానంలో సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మహిళల హ్యాండ్ బ్యాగ్ ల తనిఖీని మహిళా అధికారులు మాత్రమే నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా, ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు ,అకౌంటింగ్ టీమ్ సభ్యులు తమ తమ విధులు, బాధ్యతలు అనుసరించాల్సిన విధివిధానాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు అడిగిన సందేహాలకు మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయికృష్ణ స్పష్టమైన వివరణ ఇచ్చి నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుధీర్, రాజశేఖర్, ఎంపీడీవోలు శ్రీనివాస్, సునీల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఓవర్ లోడ్.. ఓకేనా..?

(మొదటి పేజీ తరువాయి...)




వాహనాలు ఎందుకు కనిపించవనే విషయం మిలియన్ డాలర్ల ప్రశ్న... నిన్న మొన్నటిదాకా రోడ్డు భద్రత వారోత్సవాలంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చిన అధికారులు రోడ్ల పైన కనిపిస్తున్న ఈ ఓవర్ లోడు ట్రాక్టర్ల పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**– మైనర్ల చేతికి స్టీరింగ్..! మితిమీరిన వేగం..!**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపహాడ్ మండలానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల నుండి నిత్యం వందల సంఖ్యలో జామాయిల్, సుబాబుల్ సరఫరా చేస్తున్న ట్రాక్టర్లు వస్తూ ఉంటాయి. అందులో అధిక శాతం ట్రాక్టర్లు ఓవర్ లోడ్ తో..మితిమీరిన వేగంతో రోడ్లపై ఉరకలు వేస్తూ సర్కస్ విన్యాసాలు చేస్తున్నాయి. ట్రాక్టర్ టైర్లు గాలిలోకి ఎగురుతూ.. ఒక లారీకి ఎత్తవలసిన లోడును ట్రాక్టర్ ద్వారా తరలిస్తూ కనిపిస్తున్నాయి. ఇది అధికారులకు మాత్రం కనిపించదో... లేక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరి స్తున్నారో అర్థం కాని పరిస్థితి. సుదూర ప్రాంతాల నుండి జామాయిల్, సుబాబుల్ రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు కొందరు మైనర్ డ్రైవర్లను వినియోగిస్తున్నారు. మైనర్ల చేతికి, కొందరు మద్యం సేవించి డ్రైవింగ్ చేసేవారికి వాహనాన్ని ఇచ్చి దళారులు జేబులు నింపుకుంటున్నారు. అనుభవం లేని మైనర్లు నడుపుతున్న ఆ ఓవర్ లోడ్ ట్రాక్టర్లు అదుపు తప్పితే డ్రైవర్ ప్రాణాలకే కాకుండా.., రోడ్లపై ప్రయాణిస్తున్న వారికి సైతం ప్రాణాపాయమే అంటూ పలువురు మండిపడుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికలు నామినేషన్ల దాఖలు వివరాలు

(మొదటి పేజీ తరువాయి...)

24 వార్డులకు గాను ఇప్పటివరకు 1 నామినేషన్ దాఖలైందని, ఈ నామినేషన్ బీజేపీ తరపున నమోదైనట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లోని 60 వార్డులకు గాను ఇప్పటివరకు 3 నామినేషన్లు దాఖలయ్యాయని, వీటిలో బీఆర్ఎస్ – 2, స్వతంత్ర అభ్యర్థి – 1 నామినేషన్ ఉన్నట్లు ఆయన తెలిపారు, మొత్తంగా జిల్లాలో ఇప్పటివరకు 7 నామినేషన్లు దాఖలయ్యాయని, వీటిలో బీజేపీ – 3, బీఆర్ఎస్ – 3, స్వతంత్ర అభ్యర్థులు – 1 కాగా, ఇతర రాజకీయ పార్టీల నుంచి ఇప్పటివరకు ఎటువంటి నామినేషన్లు దాఖలుకాలేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జనవరి 30, 2026 సాయంత్రం 5.00 గంటల వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నిర్ణీత గడువు లోపు అవసరమైన పత్రాలతో నామినేషన్లు దాఖలు చేయాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు.

# ఉపాధ్యాయుడుగా మారిన స్పెషల్ ఆఫీసర్ తాండ్ర మధుకర్

- **పదవ తరగతి త్రికోణమితి పాఠ్యాంశాన్ని బోధించిన తాండ్ర**





**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 28: ప్రజా జ్యోతి:** పాల్వంచ మండలంలోని కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ ను బుధవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్పెషల్ ఆఫీసర్ తాండ్ర మధుకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులకు గణిత సబ్జెక్టులోని మెలుకువలను నేర్పించారు, విద్యార్థులకు త్రికోణమితి పాఠ్యాంశాన్ని బోధించి విద్యార్థులను సంతృప్తి పరిచారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సమిష్టి కృషితో 100% ఫలితాలకు కృషి చేయాలని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగ ఉపాధ్యాయులకు గతవారం క్రీడామైదానంలో నిర్వహించిన ఆటల పోటీలను సమర్ధవంతంగా నిర్వహించి నందుకుగాను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్కరించారు. అదే విధంగా జనవరి 26న ఐ టి డి ఎ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు ప్రశంస పత్రం అందుకున్న ఆంగ్ల ఉపాధ్యాయులు బాలు నాయక్ ఒక మొక్కను బహుకరించి శాలువాతో సత్కరించి అంబేద్కర్ చిత్రపటాలను బహుకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. స్పెషల్ ఆఫీసర్ గా మీరు సూచించిన ప్రణాళికల ప్రకారం , అందించిన సలహాలు పాటించి పదో తరగతిలో 100% ఫలితాలకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు పిల్లలను బహుమతిగా అందజేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ ఎస్ బాలు, బాల సుబ్రహ్మణ్యం,స్వరూప రాణి, శంకర్, పద్మావతమ్మ, భగవాన్ దాస్, రాంధాన్, అంజయ్య,రవి, శశిగ్నత, వెంకన్న పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

## భద్రాచలంలో అక్రమ గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

ఒరిస్సా నుంచి కేరళకు అక్షయ్ సురేష్, కుంజుమాన్ సురేంద్రన్ మినిమోల్ , అనంత కృష్ణన్ లు ఒడిశా రాష్ట్రం లోని మల్కాన్ గిరి నుండి తిరువనంతపురం (కేరళ) కు తరలిస్తున్నట్లు నిందితులు అంగీకరించినట్లు ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తిరుపతి తెలిపారు, పట్టుబడిన గంజాయిని , కార్ ను , ముగ్గురు ముద్దాయిలను , 4 సెల్ ఫోన్లను , రూ. 17 వేల నగదును సీజ్ చేశామని, పట్టుబడిన గంజాయి, కారు సెల్ఫోన్లో ఇతర సామాగ్రి తో కలిపి వీటి మొత్తం విలువ 28 లక్షల 70 వేల వరకు ఉంటుందని , నిందితులను, గంజాయిని ఎన్ఫోర్స్మెంట్ అధికారులు భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్ లో అప్పగించినట్లు తెలిపారు, ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ యం.ఏ.కరీం, కానిస్టేబుల్స్ సుధీర్,వెంకట్, హనుమంతరావు, వీరబాబు , ఉపేందర్ లు ఉన్నారు. గంజాయిని పట్టుకున్న టీం ను తెలంగాణ ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ శ్రీ షానవాజ్ ఖాసీం, స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్ అభినందించారు. ఏదైనా గంజాయి కి సంబంధించిన సమాచారం ఉంటే ఎక్సైజ్ టోల్ ఫ్రీ నెంబర్ 18004252523 కు సమాచారం అందించగలరని, మీ వివరాలు గోప్యం గా ఉంచబడతాయి అని ఈ ఎస్ తిరుపతి తెలిపారు.

## పాల్వంచ ఎంపీడీవో బదిలీ

- **నూతన ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన బొగ్గ నారాయణ**



**పాల్వంచ :కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 28: ప్రజాజ్యోతి** పాల్వంచ నూతన ఎంపీడీవో గా బొగ్గ నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు, నేటి వరకు బాధ్యతలు చేపట్టిన పాల్వంచ ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి ఏపీడీగా డిప్యూటేషన్ పై వెళ్లారు, దీంతో ఎంపీడీవో ( ఎఫ్ఎసి ) గా విధులు నిర్వహిస్తున్న భోగ నారాయణ పాల్వంచ ఎంపీడీవోగా నియమితులయ్యారు, దీంతో ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన నారాయణకు పాల్వంచ ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఘనంగా స్వాగతం స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు




## సీఎం కప్ ఎంపిక పోటీలకు శ్రీకారం చుట్టిన ఎంపీడీవో మహాలక్ష్మి

- **ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, కోకో స్నేహపూర్వక పోటీలు**
- **విద్యార్థులకు హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, కమిటీల కార్యదర్శులతో ప్రమాణ స్వీకారం**



**అన్నపురెడ్డిపల్లి, జనవరి 28,ప్రజా జ్యోతి:** అశ్వారావుపేట నియోజకవర్గం అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో బుధవారం సీఎం కప్ ఎంపిక పోటీలు, స్నేహపూర్వక క్రీడా పోటీలను మండల అభివృద్ధి అధికారి కావూరి మహాలక్ష్మి ప్రారంభించారు. మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, కోకో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ హౌస్ ల కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు, వివిధ కమిటీల కార్యదర్శులతో ఎంపీడీవో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు మరింత ఉత్సాహంగా ఆడి జిల్లా, రాష్ట్ర స్థాయిలో మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ హౌస్ ల ఏర్పాటు వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డిగూడెం సర్పంచ్ సున్నం నాగభూషణం, ఉప సర్పంచ్ వేముల నరేష్, ఉప విద్యాశాఖాధికారి యేసురత్నం, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు జీ. శంకర్ మహదేవన్, వ్యాయామ ఉపాధ్యాయులు సున్నం కృష్ణారావు, లకావత్ జయరాం, ఉపాధ్యాయ బృందం, మండల క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వన దేవతల జన జాతర

- గద్దెల పైకి పకిడిత రాజు సార్లమ్మ గోవిందరాజు.
- నేడు సమ్మక్క రాక.



**గుండాల ప్రజా జ్యోతి జనవరి 28.** మేడారం అడవుల్లో అద్భుత ఘట్టం నేడు మొదలు కానుంది బుధవారం సాయంత్రం పగిడిద్దరాజు సార్లమ్మ గోవింద రాజు గద్దెలపై కొలువుదీరగా నేడు సమ్మక్క రాకతో ప్రాంతమంతా భక్తి రూపంతో పులకించిపోతుంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం వేపల గడ్డ గ్రామం నుంచి అరం వంశీయులు సమ్మక్క భర్త పగిడిద్దరాజును (పగడల) కాలినడక ద్వారా మేడారం చేరుకోగా లాంఛనంగా గద్దెలపైక ప్రతిష్టించగా. కర్నేపల్లి నుంచి సమ్మక్క కూతురు సార్లమ్మను పసుపు కుంకుమలను భరణి రూపంలో మేడారంకు తీసుకొచ్చి గద్దెలపై ఉంచగా కొండాయి నుంచి గోవిందరాజులు లాంచనంగా తీసుకోవచ్చి గద్దెలపై ప్రతిష్టించడంతో మొదటి ఘట్టం ప్రారంభమైంది నేడు సమ్మక్క దేవత రావడంతో జాతర మహా జాతరగా కానుంది ఇప్పటికే ఇక్కడికి చేరుకున్న లక్షలాది మంది భక్తులు సమ్మకరాకు కోసం ఎదురుచూస్తూ ఉంటారు చిలకలగుట్ట నుండి కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్క తల్లిని ప్రభుత్వ లాంఛనాలతో తీసుకొని వచ్చి మేడారంలోని గద్దెపై ప్రతిష్టించడంతో జాతర మొదలుకానుంది. సమ్మక్క తల్లి గద్దెపై కొలువు తీయడంతో ఒక్కసారిగా మేడారం భక్తిశ్రద్ధలతో పులకించి పోతుంది మాఘ శుద్ధ పౌర్ణమి రోజు జరిగే ఈ జన జాతర ఒకనాడు అంటే 13వ శతాబ్దంలో ఆనాటి గిరిజన తెగలను ఏకతాటి పై తీసుకొచ్చి కాకతీయులపై తిరుగుబాటు చేసి పోరాడి అదృశ్యం కావడంతో ఆనాటి నుండి సమ్మక్క సారక్క జాతరగా ప్రారంభం కావడంతో నాడు వీరవనితలుగా పేరుందిన సమ్మక్క సారక్క నేడు వనదేవతలుగా పేరుంది మహా జాతరగా మారింది.



## పాల్వంచ డివిజన్ కార్యాలయం లో మొదటి రోజు ఒక నామినేషన్ దాఖలు




**పాల్వంచ: కొత్తగూడెం కలెక్టరేట్: జనవరి 28 :ప్రజా జ్యోతి** కొత్తగూడెం నగరపాలక సంస్థ పాల్వంచ డివిజన్ కార్యాలయం లో మొదటి రోజు బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. ఎనిమిదో వ డివిజన్ కు చెందిన కాంపెల్లి సంధ్య బీఆర్ఎస్ పార్టీ తరపున తన నామినేషన్ పత్రాన్ని సంబంధిత అధికారికి అందచేశారు. మొత్తం 35 నామినేషన్ పత్రాలను వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు మొదటి రోజు తీసుకోగా అందులో ఒకటి మాత్రమే దాఖలైంది. బుధవారం పదకొండు గంటల నుండే పాల్వంచ డివిజన్ కార్యాలయం వద్ద నామినేషన్ తీసుకునే వారి సందడి తో కార్యాలయ ప్రాంగణం కొలహాలంగా మారింది. పాల్వంచ డివిజన్ కార్యాలయం లో మొత్తం తొమ్మిది కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క కౌంటర్ కు మూడు డివిజన్ లను కేటాయించి, వాటి ద్వారా నామినేషన్ పత్రాలను అభ్యర్థులకు అందచేశారు.

## జంతు సంక్షేమ వారోత్సవాల అవగాహన సదస్సు



**బూర్గంపహాడ్, జనవరి 28 (ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా పశువైద్య, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జంతు సంక్షేమ వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం జరిగిన అవగాహన సదస్సులో జిల్లా పశువైద్యాధికారి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జంతువులు, మనుషుల మధ్య సమన్వయం, జంతువులు, కుక్కలు గాయపర్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాంటీ రాబీస్ టీకాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. రాజ్యాంగంలో మానవులతో పాటు జంతువులకు కూడా కొన్ని హక్కులు కల్పించబడ్డాయని గుర్తుచేశారు. వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యులు బాలకృష్ణ, రాజేందర్, జాతీయ మానవ జంతు హక్కుల సంస్థ ప్రతినిధి టి.గోవిందరెడ్డి, గణేష్, కిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కంటే కూతుర్నే కనాలి..

- ఘనంగా తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన కూతురు



**చర్ల ,జనవరి 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం ఓ కూతురే తన తండ్రికి కొడుకై తలకొరివి పెట్టిన సంఘటన చర్ల మండలోని పాత చర్ల అంబేద్కర్ నగర్ లో జరిగింది. అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన చింతల రాంబాబు, కమల కుమారి దంపతులకు ఒక కుమార్తె భారతి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి అయిన చింతల రాంబాబు వయస్సు (54) తీవ్ర అస్వస్థకు గురై బుధవారం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు . కుమారుడు లేని తన ఇంటిలో సాంప్రదాయబద్ధంగా కొరివి పెట్టాల్సిన బాధ్యత పెద్ద కుమార్తె భారతి తీసుకొని తన తండ్రికి ఘనంగా భారీ జన సందోహంతో ఊరేగింపుతో అంత్యక్రియలు నిర్వహించి కన్నతండ్రి రుణం తీర్చుకుంది .ఈ సంఘటన చూసిన చర్ల మండల అంబేద్కర్ నగర్ గ్రామప్రజలు కంటే కూతుర్నే కనాలి అంటూ అభినందిస్తున్నారు.

## అన్నపురెడ్డిపల్లి గ్రామానికి

# మంచి మనసున్న మనుషులు

- వీడియో షేర్‌తో గుండు మాధవికి జైపూర్ కాలు అమరిక... మళ్లీ చిరునవ్వు
- సిటీ కేబుల్ అజ్జు, వక్కలగడ్డ నగేష్ సేవలు అభినందనీయం
- మార్వాడి యువ మాంచ్ – గ్రేటర్ హైదరాబాద్ సేవా కార్యక్రమం స్ఫూర్తిదాయకం

**అన్నపురెడ్డిపల్లి, జనవరి 28,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి పంచాయతీ వాట్సాప్ గ్రూపులో వారం రోజుల క్రితం షేర్ చేసిన "ఉచిత కాలిపర్ క్యాంప్" వీడియో కారణంగా అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన గుండు మాధవి (కరెంట్ నాగు భార్య)కు జైపూర్ కాలు అమర్చడం జరిగింది. ఈ వీడియోను గ్రూపులో షేర్ చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ వీడియోను చూసిన వెంటనే అన్నపురెడ్డిపల్లి గ్రామ సిటీ కేబుల్ మహమ్మద్ మదార్, వారి పెద్ద కుమారుడు సిటీ కేబుల్ అజ్జు, అలాగే అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన వక్కలగడ్డ నగేష్ (కిరాణా షాప్) స్పందించి సహాయం చేయడానికి ముందుకొచ్చారు. గుండు మాధవి సుమారు 7 నెలల క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో కాలు కోల్పోయి, అప్పటి నుంచి మంచానికే పరిమితమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న సిటీ కేబుల్ అజ్జు మరియు వక్కలగడ్డ నగేష్ ఆమె ఇంటికి వెళ్లి క్యాంప్ వివరాలను క్లుప్తంగా వివరించి, "మేము కూడా మీతో పాటు హైదరాబాద్ వస్తాం" అంటూ ధైర్యం చెప్పారు. ఈ నెల 25వ తేదీన హైదరాబాద్‌లో మార్వాడి యువ మాంచ్ – గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కాలిపర్ క్యాంప్‌కు ఆమెను తీసుకెళ్లి కొలతలు ఇప్పించారు. మంగళవారం రాత్రి అన్నపురెడ్డిపల్లి నుంచి బయలుదేరి బుధవారం ఉదయానికి హైదరాబాద్ చేరుకుని, అవసరమైన ప్రక్రియ పూర్తిచేసి గుండు మాధవికి జైపూర్ కాలు అమరిక విజయవంతంగా పూర్తి చేయించారు. అనంతరం ఆమెను సురక్షితంగా గ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, మార్వాడి యువ మాంచ్ – గ్రేటర్ హైదరాబాద్ సమితి చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కాలు కోల్పోయినవారికి, నడవలేని స్థితిలో ఉన్నవారికి ఈ సమితి ఒక అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటోందని అన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఉచిత క్యాంపులను నిర్వహిస్తూ ఎంతోమంది దివ్యాంగులకు ఆశను, ధైర్యాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు బాధలో ఉన్న కుటుంబాలకు కొత్త జీవితం ఇస్తాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. గుండు మాధవికి జైపూర్ కాలు అమరిక కావడంతో ఆమె ముఖంలో మళ్లీ చిరునవ్వు కనిపించిందని, ఎంతో కాలం తర్వాత సంతోషం ఆమె కళ్లలో మెరిసిందని గ్రామస్తులు చెప్పారు. ఇకపై ఆమె తన పనులు తానే చేసుకునే అవకాశం రావడం గొప్ప విషయమని పేర్కొన్నారు. పక్కింటి వారి సమస్యను కూడా పట్టించుకోని ఈ రోజుల్లో, అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలబడి సేవాభావంతో ముందుకు వచ్చిన సిటీ కేబుల్ అజ్జు మరియు వక్కలగడ్డ నగేష్ సేవలను గ్రామస్తులు కొనియాడారు. వీరిద్దరి చొరవ వల్లే ఒక ఇంట్లో మళ్లీ ఆశ వెలిగిందని, ఒక కుటుంబానికి కొత్త దారి చూపినట్టయ్యిందని తెలిపారు. చివరగా ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ, అన్నపురెడ్డిపల్లి గ్రామంలో ఇలాంటి సేవా భావం మరింత పెరగాలని, అవసరంలో ఉన్నవారికి అందరూ అండగా నిలవాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.



